క్లుప్తంగా

వంద ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు సిద్ధం



ఎదురుపాడులో గుంతలను సిద్ధం చేసుకుంటున్న రైతన్నలు

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాలలో హార్టీకల్చర్ వ్యవసాయం కింద వివిధ రకాల పండ్లతోటలను 100 ఎకరాలలో సాగుచేసుకునేందుకు రైతన్నలు సిద్ధం అవుతున్నారని ఏపీఓ రేష్మ తెలిపారు. సోమవారం ఆయా గ్రామాలలో రైతులు ఉద్యాన వ్యవసాయ పనులను ప్రారంభించారు. మండలంలోని గ్రామాలలో జామ, చీనీ, మునగ, మామిడి, నిమ్మ, సపోట రకాలను సాగుచేసుకునేందుకు రైతులు ముందుకు వాచ్చారన్నారు. గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్ల ఆధ్వర్యంలో మొక్కలు నాటుకునేందుకు రైతులు గుంతలు తీసుకుంటూ సన్నద్ధం అవుతున్నారన్నారు. వర్షాలు పడగానే మొక్కలను రైతులకు పంపిణీ చేస్తామన్నారు. ఇంకా ఏవరైనా రైతులు ఆసక్తిగా ఉంటే ముందుకురావాలని సూచించారు. పొలాల గట్ల వెంట టెకు, టెంకాయ, నేరేడు మొక్కలు కూడా నాటుకోచవ్చని చెప్పారు.

ఆ భూములు జలసంరక్షణకు వినియోగించాలి

ఆత్మకూరురూరల్: పాములపాడు మండలం మిట్టకందాల గ్రామంలో వ్యవసాయ యోగ్యం కాని 22 ఎకరాల అసైన్డ్ భూములకు పట్టాలు రద్దు చేసి, ఎర్రకుంట చెక్ డ్యాంతో అనుసంధానించి జలసంరక్షణకు ఉపయోగించాలని బహుజన సమాజ్‌పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్పందనలో ఆర్‌డీవో దాస్‌కు వినతి పత్రం అందజేసింది. బీఎస్పీ నందికొట్కూరు అసెంబ్లీ ఇన్‌చార్జ్ స్వాములు మాట్లాడుతూ.. గతంలో నిరుపేదలైన రైతులకు ప్రభుత్వం మిట్టకందాల గ్రామంలోని 487 సర్వే నంబరు లో గల 22 ఎకరాల భూమిని కేటాయించింది. అయితే ఈ భూమిలోని మట్టిని రైతులు అలగనూరు రిజర్వాయర్ కట్టల కోసం అమ్ముకోవడంతో ఆ భూములు వ్యవసాయానికి పనికి రాకుండా పోయాయని వివరించారు.

జీసీ పాలెం వీఆర్‌ఓ బదిలీ

మహానంది: బండిఆత్మకూరు మండలం జీసీ పాలెం గ్రామ వీఆర్‌ఓ జగదీష్ బదిలీ అయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కర్నూలు మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఈశ్వరయ్యను జీసీ పాలెం వీఆర్‌ఓగా నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. త్వరలో ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పగిడ్యాల: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతీ కోరారు. సోమవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు ఇంటింటికీ తిరిగి రీ సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసులు, ఏపీఓ మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ



దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ

ఆత్మకూరు: పట్టణంలోని ఎరువులు, విత్తన దుకాణాలను ఏడీఏ ఆంజనేయులు సోమవా రం తనిఖీ చేశారు. నాసిరకం ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొన్ని దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు రికార్డులు సక్రమంగా లేకపోవడంతో 19.20క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాలను, 55.02 మెట్రిక్ టన్నుల ఎరువులను విక్రయాలను నిలిపివేశారు. కార్యక్రమంలో ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మహానంది: నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని బండిఆత్మకూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి నాగరాజు తెలిపారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బండిఆత్మకూరులో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 21న బండిఆత్మకూరులోని కస్తూరిబా పాఠశాలలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పేదలకు అండగా సీపీఐ

మహానంది: కార్మిక, పేదల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ అండగా నిలబడుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య అన్నారు. శాలివాహన అన్నసత్ర భవనంలో సీపీఐ జిల్లా సమావేశం రెండో రోజు సోమవారం కొనసాగింది. రంగనాయుడు, నాగరాముడు, మోటారాముడు, ధనుంజయుడు పాల్గొన్నారు.

అడిగిన వెంటనే విద్యుత్ కనెక్షన్

- రైతులు దరఖాస్తు చేసుకున్న నెలరోజుల్లోగా మంజూరు
- టీడీపీ హయాంలో పెండిగ్‌లో ఉన్న వాటికీ మోక్షం
- ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 13,949 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



జూపాడుబంగ్లా విద్యుత్ కార్యాలయంలో సిద్ధంగా ఉన్న సామగ్రి

జూపాడుబంగ్లా: ఓ తడి నీరు పారిస్తే చాలు బంగారు పంటలు పండే భూమి ఉన్నా నీటి వనరుల్లేక రైతులు పంటలు పండించుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్పోసొప్పో చేసి పొలంలో బోర్లు, బావులు తవ్వుకున్నా వాటికి టీడీపీ పాలనలో విద్యుత్ కనెక్షన్ లభించక సంవత్సరాల తరబడి ట్రాన్స్‌కో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని బోర్లు, బావులు తవ్వుకున్న రైతులు అడిగిన తక్షణమే వారికి విద్యుత్ కనెక్షన్ మంజూరు చేసేలా ట్రాన్స్‌కో ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో దరఖాస్తు చేసుకున్న నెలరోజుల్లోనే విద్యుత్ కనెక్షన్లు ఇస్తుండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ హయాంలో పెండింగ్‌లో ఉన్న కనెక్షన్లన్నీ మంజూరు

నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరు, జూపాడుబంగ్లా, మిడుతూరు, పాములపాడు, పగిడ్యాల, కొత్తపల్లి మండలాల్లో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటిదాకా 13,949 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశారు. టీడీపీ పాలన నుంచి ఏప్రిల్ 2023 వరకు పెండింగ్‌లో ఉన్న 2,380 మంది రైతులందరికీ కేవలం ఏడు మాసాల్లోనే విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మే మాసానికిగాను నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో 60 మంది రైతులు దరఖాస్తుచేసుకోగా వారికి ఈనెలాఖరులోగా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

నందికొట్కూరు నియోజకవర్గంలో కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల వివరాలు

మండలం	ప్రస్తుతం ఉన్న వ్యవసాయ కనెక్షన్లు	కొత్త దరఖాస్తులు	పరిష్కరించినవి
జూపాడుబంగ్లా	3,035	29	376
నందికొట్కూరు	1,899	09	174
కొత్తపల్లి, పాములపాడు	4,630	14	1,165
మిడుతూరు, పగిడ్యాల	4,385	08	665
మొత్తం	13,949	60	2,380

రైతుల మధ్య తగాదాల్లేకుండా..

బోర్లు, బావులు తవ్వుకునే విషయంలో రైతుల మధ్య ఎలాంటి తగాదాలు నెలకొనకుండా వాల్టా చట్టం నిబంధనలను అనుసరించి విద్యుత్ కనెక్షన్లు ఇస్తుండటంతో భవిష్యత్‌లో రైతుల మధ్య తగాదాలకు పుల్‌స్టాప్ పడనుంది.

డబ్బులు చెల్లించిన నెలరోజుల్లోగా కనెక్షన్లు

రైతులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న వెంటనే వాటిని పరిశీలించిన ట్రాన్స్‌కో అధికారులు రైతుల పొలం వద్దకు వెళ్లి తవ్విన బోర్లను పరిశీలించి వాటికి విద్యుత్ కనెక్షన్ మంజూరుకు ప్రతిపాదనలు(ఎస్టిమేట్)సిద్ధం చేసి ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపిస్తారు. దీని ఆధారంగా ఆన్‌లైన్‌లో జనరేట్ అయిన డిమాండ్ మేరకు నగదును దరఖాస్తుదారుడు చెల్లించిన నెలరోజుల్లోగా అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారు.

మూడు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ వరకు ఉచితం

దరఖాస్తు చేసుకొన్న రైతులకు ఎస్టిమేషన్‌లో ఎల్టీ లైన్ నుంచి 3 విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ అమర్చాల్సి వస్తే వారు పైసా చెల్లించాల్సిన అవసరం లేదు. ఉచితంగానే పోల్స్‌పాతి, తీగనులాగి ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి బోరు, బావులకు విద్యుత్ కనెక్షన్ ఇస్తారు. 3పోల్స్ దాటి ఎన్ని పోల్స్ అయితే పాతాల్సి ఉంటుందో వాటికి మాత్రమే ఆన్‌లైన్ ఎస్టిమేషన్ ప్రకారంగా నిర్ణీత రుసుమును రైతులు చెల్లించాల్సి ఉంటుంది. రైతులు ఏర్పాటుచేసుకొనే మోటార్ల సామర్థ్యాన్ని అనుసరించి ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చుతారు.

నెలరోజులకే విద్యుత్ కనెక్షన్ మంజూరు చేశారు



టీడీపీ పాలనలో నేను వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకొని నెలలు తరబడి కరెంటు ఆఫీసు చుట్టూ తిరిగాను. ఎస్టిమేషన్లు రాంగ్ ఉన్నాయని పాతదరఖాస్తు రద్దుకావడంతో ఇప్పుడు మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకున్నాను. డబ్బులు కట్టిన నెలలోపే నాకు కనెక్షన్ మంజూరు చేశారు. చాలా సంతోషంగా ఉంది.

అయ్యన్న, రైతు, తంగదంచ

సామగ్రి అందుబాటులో ఉన్నాయి



గతంలో రైతులు దరఖాస్తు చేసుకుంటే విద్యుత్ కనెక్షన్లు ఇవ్వటానికి సరిపడా సామగ్రి లేక సీనియార్టీ జాబితాను అనుసరించి మంజూరు చేసే వాళ్లం. ప్రస్తుతం అవసమైన సామగ్రి వెంట వెంటనే మంజూరవుతుండటంతో రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని డబ్బులు చెల్లిస్తే నెలరోజుల్లోగా కనెక్షన్లు ఇస్తున్నాం.

శ్రీనివాసులు, ట్రాన్స్‌కో ఏఈడీ, నందికొట్కూరు డివిజన్

బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓలు



కొత్తపల్లి ఎంఈఓ-2 ఇనాయతుల్లాను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పగిడ్యాల: మండల విద్యాధికారి-2గా మల్లికార్జున రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంఈఓ సుభాన్ తెలిపారు. డోన్ మండలం కొచ్చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఎంఈఓ-2 గా పగిడ్యాల మండలానికి బదిలీపై వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఈఓ-2ను సన్మానించి అభినందనలు తెలిపారు.

వెలుగోడుఎంఈవో-2గా నాగ బ్రహ్మయ్య

వెలుగోడు: మండల రెండో విద్యాశాఖ అధికారి(ఎంఈవో-2)గా నాగ బ్రహ్మయ్య సోమవా రం బాధ్యతలు చేపట్టారు. ఆలూరు మండలం పెద్ద హోతూరు హైస్కూల్ హెచ్ఎంగా పని చేసిన నాగ బ్రహ్మయ్య పదోన్నతిపై మండలానికి వచ్చారు. ఆయనను ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

మిడుతూరు ఎంఈఓ -2గా శ్రీనాథ్

మిడుతూరు: మండల ఎంఈఓ -2 గా శ్రీనాథ్ సోమవారం బాధ్యతలు చేపట్టినట్లు ఎంఈఓ మౌలాలి తెలిపారు. కంబాలపాడులో ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనాథ్ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారన్నారు.

కొత్తపల్లి: మండల విద్యాధికారి - 2గా బాధ్యతలు స్వీకరించిన ఇనాయతుల్లాను ఎంఈఓ-1 శ్రీరాములు ఉపాధ్యాయ బృందంతో కలసి సోమవారం ఎమ్మార్సీ భవనంలో పూలమాల, దుశ్శాలువలతో సన్మానించారు. ఎంఈఓ-2 మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి, పాఠశాలల అభివృద్ధికి నిరంతరం పర్యవేక్షణచేస్తూ కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉసేనయ్య, గాలీబ్ అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంతో గిరిజనులకు ఆదాయం



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న పీఓ రవీంద్రారెడ్డి

మహానంది: తేనెటీగల పెంపకంతో గిరిజనులకు ఆదాయం చేకూరుతుందని ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి తెలిపారు. మహానంది సమీపంలోని గిరిజన గూడెంలో సోమవారం తేనేటీగల పెంపకంపై వ్యవసాయపరిశోధనా స్థానం, ఐటీడీఏ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీఓ మాట్లాడుతూ తేనే తయారు చేసేందుకు అవసరమైన పెట్టెలను ఏర్పాటు చేసి తయారీ నేర్పిస్తామన్నారు. మహానంది సమీపంలోని చెంచుగూడెం గిరిజనులు తయారు చేసిన తేనేతో పాటు వివిధ రకాల ఉత్పత్తులను గిరిజనులు ఇక్కడే విక్రయించుకునేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ మంజునాథ్, రిటైర్డ్ ఏఓ రామరాజు, వెలుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఓంకారంలో వైభవంగా ఆరుద్రోత్సవం



ఆరుద్రోత్సవ పూజలందుకున్న ఓంకార సిద్ధేశ్వరుడు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన ఓంకారం క్షేత్రంలో కొలువైన శ్రీ గంగా, ఉమాసమేత శ్రీ ఓంకార సిద్ధేశ్వరస్వామి వారికి ఈశ్వరుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం విశేషపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఏకవార రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాభిషేకం, ప్రత్యేక అలంకరణ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు.

పల్లకీలో విహరించిన ఆదిదంపతులు

శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులు పల్లకీలో విహరించారు. జ్యేష్ట మాసం, సోమవారం, స్వామివారి జన్మనక్షత్రం ఆరుద్ర అన్నీ కలిసి రావడంతో మహానందిలో పల్లకీసేవ కనులపండువగా జరిగింది. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు స్వామి,అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. గోమాతను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీ ముందు నడిపిస్తూ ఆలయ ప్రాకారంలో ఉత్సవాన్ని చేపట్టారు.

మహానందిలో రేపు రాహుకేతువుకు మండలాభిషేకం

మహానందిలో రాహుకేతు విగ్రహాలు ప్రతిష్ఠించి నలభై రోజులు పూర్తయిన సందర్భంగా బుధవారం విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు వేదపండితులు రవి శంకర అవధాని తెలిపారు. రాహుకేతులకు మండలాభిషేకం పూజలు నిర్వహిస్తామన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పగిడ్యాల: రోడ్డుపై తెగిపడిన విద్యుత్ సర్వీస్ వైర్‌తో త్రుటిలో ప్రమాదం తప్పింది. నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద కిందకు వేలాడుతున్న సర్వీస్ వైర్ వేలాడుతూ ప్రమాదకంగా మారింది. సోమవారం రాత్రి సోలార్ విద్యుత్ టవర్ పనులు చేసే కంపెనీకి చెందిన లారీ టాప్ తగలడంతో వైరు కిందకు వేలాడుతోంది. గమనించిన స్థానికులు కర్ర సాయంతో పైకి ఎత్తి పెట్టారు. ఎస్సీ కాలనీవాసులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది.

శ్రీనిధి డిపాజిట్ స్కీమ్‌లో అధిక వడ్డీ

వెలుగోడు: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతనంగా ప్రవేశపెట్టిన శ్రీనిధి డిపాజిట్ స్కీమ్‌లో డిపాజిట్ చేస్తే అధిక వడ్డీ లభిస్తుందని బ్రాంచ్ మేనేజర్ నారాయణరెడ్డి తెలిపారు. శ్రీనిధి డిపాజిట్ స్కీమ్‌పై సోమవారం పట్టణ వీధుల వెంట బ్యాంకు సిబ్బంది పర్యటించి వ్యాపారస్తులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. బ్రాంచ్ మేనేజర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి శ్రీనిధి డిపాజిట్ స్కీం అమలులోకి వచ్చిందన్నారు. ఇందులో డిపాజిట్ చేసే సీనియర్ సిటిజన్‌లకు 7.90 శాతం(ఎఫెక్టివ్ రేట్ 8.25 శాతం), 60 ఏళ్లలోపు 7.30 శాతం (ఎఫెక్టివ్ రేట్ 7.62 శాతం) వడ్డీ చెల్లిస్తామన్నారు. ఈ డిపాజిట్ పథకం ఈ నెల 30 వరకు మాత్రమే అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్లు శ్రీజ, హేమలత, సూపర్‌వైజర్ శ్రీనాథ్, సిబ్బంది ప్రియా, మనోహర్ పాల్గొన్నారు .

ఎస్సీ వసతి గృహంలో 50 సీట్లు

ఆత్మకూరు: మండలంలోని వెంకటాపురం ఎస్సీ వసతి గృహంలో 50సీట్లు ఖాళీగా ఉన్నాయని వార్డెన్ అంకన్న సోమవారం తెలిపారు. నిరుపేద ఎస్సీ విద్యార్థులకు 40సీట్లు, ఎస్టీకి 10 సీట్లు ఖాళీ ఉన్నాయని చెప్పారు. విద్యార్థులు నేరుగా తమ హాస్టల్‌లో చేరవచ్చని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వసతి గృహంలో సీట్లను భర్తీ చేస్తామని చెప్పారు. సమీప గ్రామాల విద్యార్థులే కాకుండా ఆత్మకూరు, ఇతర మండలాల విద్యార్థులు కూడా చేరవచ్చని తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనర్సయ్య తెలిపారు. ఈనెల 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, 24 నుంచి 30వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ ఇచ్చుకోచ్చని చెప్పారు. వచ్చే నెల 3వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. 4 నుంచి కళాశాలలు ప్రారంభమవుతాయన్నారు. రిజిస్ట్రేషన్‌కు, ఇతర వివరాలకు కళాశాలలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు సెల్ : 9963731010కు ఫోన్ చేయాలన్నారు.

వెలుగోడు చరిత్రపై పరిశోధనకు ఎంఫిల్ పట్టా



పట్టాను విద్యార్థినికి అందజేస్తున్న పీఠాధిపతి

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో సోమవారం వెలుగోడు చరిత్ర, సంస్కృతిపై పరిశోధన చేసిన శీలం ఇంద్రజకు ఎంఫిల్ పట్టాను తెలుగువర్సిటీ పీఠాధిపతి ఎం.శ్రీనివాసరావు అందజేశారు. పరిశోధన ద్వారా చారిత్రక యుగం నుంచి నేటి వరకు వెలుగోడు చరిత్రను చక్కగా వివరించారని ఆయన ప్రశంసించారు. మరిన్ని పరిశోధనలు చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

అన్నివర్గాల సంక్షేమమే జగనన్న ధ్యేయం

- జగనన్నను మరో మారు ఆశీర్వదించండి
- బూటకపు మేనిఫెస్టోతో వస్తున్న బాబును నమ్మొద్దు
- మండ్లెంలో గడప గడపకు కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే ఆర్థర్



మహిళలతో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

జూపాడుబంగ్లా: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరో మారు ఆశీర్వదించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ కోరారు. సోమవారం మండలంలోని మండ్లెం గ్రామసచివాలయం-1 పరిధిలో గ్రామ నాయకుడు గుండ్రెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని గడప గడపకు వెళ్లి ప్రజలకు ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రజలు విన్నవించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రం, ఉర్దూ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు అంకితభావంతో విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయం దండగన్న చంద్రబాబునాయుడు, తన పాలనలో రైతులను విస్మరించటంతో వందల మంది ఆత్మహత్యలకు ప్పాలడ్డారన్నారు.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రైతుల సంక్షేమం కోసం గ్రామాల్లోనే రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటుచేసి నాణ్యమైన విత్తనాలు, మంజూరు, ఎరువులు అందజేస్తున్నారని తెలిపారు. చంద్రబాబునాయుడు అధికార దాహంతో అందరి మేనిఫెస్టోలను కాపీకొట్టి బూటకపు హామీలతో వస్తున్నారని ఆయనను ఎవ్వరూ నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఎంఈఓ తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, సర్పంచ్‌కృపమ్మ,తూడిచెర్ల సర్పంచ్ బాలమద్దిలేటి, దేవసహాయం, కరుణాకర్‌రెడ్డి, జంగాలపెద్దన్న, ఉస్మాన్‌బాష,శివానందరెడ్డితదితరులుపాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

నందికొట్కూరు: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ఎంఈఓ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి మల్లిస్వామి అన్నారు. సోమవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రాజశేఖర్‌బాబుకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. పీడీఎస్‌యూ నాయకులు ప్రణయ్, శ్రీనాథ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ పథకాలను ఉపయోగించుకోండి

నందికొట్కూరు రూరల్ : రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ షేక్షావలి సూచించారు. సోమవారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో రైతులకు సబ్సిడీ కింద మంజూరైన తైవాన్ స్ప్రేయర్‌ను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయాధికారులు అందజేసే కౌలు గుర్తింపు కార్డులను తప్పనిసరిగా కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్డుల ద్వారా ప్రభుత్వం అందించే పథకాలను ప్రతి రైతు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ శాంతిరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు

కొత్తపల్లి: మండల పరిధిలోని పెద్దగుమ్మడాపురం బస్ షెల్టర్ వద్ద సోమవారం ఒక బైకు మరో ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఆత్మకూరు మండలం కొత్తరామాపురం గ్రామానికి చెందిన వెంకటలక్ష్మమ్మ కుమారుడు యుగంధర్‌తో కలసి మోటారు సైకిల్‌పై సంగమేశ్వరాలయాన్ని దర్శించుకునేందుకు వెళ్తున్నారు. ఆదే సమయంలో జూపాడుబంగ్లా మండలం తుడిచర్ల గ్రామానికి చెందిన జెమ్స్, కిరణ్‌తో కలసి మోటారు బైకుపై ముసలిమడుగు గ్రామంలోని తన చెల్లెలు వద్దకు వెళ్తున్నారు. పెద్దగుమ్మడాపురం బస్‌షెల్టర్ వద్ద జెమ్స్, కిరణ్ వెళ్తున్న బైకు అదుపు తప్పి ముందుగా వెళ్తున్న వెంకటలక్ష్మమ్మ బైకును ఢీకొట్టింది. వెంకటలక్ష్మమ్మ నడుముకు బైకు హ్యాండిల్ తగలడంతో నడవలేని స్థితికి చేరుకుంది. జెమ్స్, కిరణ్‌లు కింద పడడంతో తీవ్ర రక్త గాయలు అయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఓనేసిమస్ అక్కడికి చేరుకొని, ఏఎన్ఎం సామమ్మ సహాయంతో క్షతగాత్రులను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి జెమ్స్, కిరణ్‌లను మెరుగైన వైద్యసేవల కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు 108 సిబ్బంది ఓనేసిమస్ తెలిపారు. కొత్తపల్లి పోలీసులు కేసునమోదు చేసుకొని ప్రమాదానికి గల కారణాలను విచారిస్తున్నారు.

దళితులు, బీసీల భూములు అప్పగించాలి

ఆత్మకూరు: నందికొట్కూరు నియోజకవర్గంలోని మిడుతూరు గ్రామ దళితులు, బీసీలకు ప్రభుత్వం ఇచ్చిన భూములను అప్పగించాలని సీపీఎం నాయకులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ కోరారు. పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మిడుతూరు గ్రామానికి చెందిన దళితులకు, బీసీలకు గతంలో పొలాలు మంజూరు చేసి పాసు పుస్తకాలు ఇచ్చారన్నారు. అయితే ఇప్పటికీ పొలాలు ఎక్కడ ఉన్నాయో అధికారులు చూపించలేదని, సత్వరమే పొలాలు చూపించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాబాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రభుత్వ ప్రోత్సాహం

పగిడ్యాల: విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్న తపనతో ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు మరువలేనిదని జెడ్పీటీసీ పుల్యాల దివ్య, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం పదో తరగతి విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు విశేషంగా కృషి చేస్తున్నారని చెప్పారు. అనంతరం జగనన్న విద్యా కానుక కింద మంజూరైన యూనిఫాం దస్తుల మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 సుభాన్, ఎంఈఓ-2 మల్లికార్జున రెడ్డి, హెచ్ఎం మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు సత్కారం

నందికొట్కూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో(కోటా) హెచ్ఎం సలీంబాషా ఆధ్వర్యంలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం జరిగింది. పదిలో టాపర్లుగా నిలిచిన మొల్ల షబానా, జకల ఆదిత్య, బోనాసి శివప్రసాద్ ఆచారిలను సత్కరించి, నగదు ప్రోత్సాహకం అందజేశారు.



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య

మహానంది: బండిఆత్మకూరు మండలం ఈర్నపాడులోని జెడ్పీ పాఠశాలలో సోమవారం వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ ముడిమెల పుల్లారెడ్డి, పీఎంసీ చైర్మన్ అన్నెం ప్రతాపరెడ్డి జగనన్న ఆణిముత్యాలను సన్మానించి ప్రశంసా పత్రాలు, మెడల్స్ బహూకరించారు. గాజులపల్లె జెడ్పీ పాఠశాలలో ఎంపీటీసీ సభ్యుడు చౌటుపల్లి నరసింహులు పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన సిరివెన్నెల, ఆసియా, ఇలియాస్‌లకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందించారు.

ఆత్మకూరు: మండలంలోని వెంకటాపురం హైస్కూల్‌లో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన జగనన్న ఆణిముత్యాలకు హెచ్ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. టాపర్లు ఆసీన్, విఘ్నేశ్వర్, సాయినాథరెడ్డిలకు మెడల్, ప్రశంసాపత్రం, నగదు బహుమతులు అందజేశారు.



వేంపెటలో జగన్న ఆణిముత్యాలలో భాగంగా విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న దృశ్యం

పాములపాడు: మండల పరిధిలోని వేంపెంట జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం జరిగింది. ఎంఈఓ బాలాజీనాయక్ ఆధ్వర్యంలో పాఠశాల టాపర్లు మాల్యశ్రీ బాయి (580), సురేంద్రకుమార్ (564), శైలజ (523)లను సన్మానించి, నగదు, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మాణిక్యమ్మ, హెచ్ఎం కృష్ణమూర్తి, రిటైర్ ఉపాధ్యాయుడు దానమయ్య తదితరులు పాల్గొన్నారు.